37 మంది ఎస్ఐలకు స్థాన చలనం..!

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు రేంజ్ పరిధిలో 37 మంది ఎస్ఐలకు స్థానచలనం చేస్తూ ఏలూరు రేంజ్ డిఐజి ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఏలూరు రేంజ్ పరిధిలో గత కొంతకాలంగా ఎస్ఐ, సిఐలకు ఏలూరు రేంజ్ డిఐజి అశోక్ కుమార్ బదిలీలు చేపట్టారు. ఇందులో భాగంగానే 26 మంది ప్రొబేషనరీ ఎస్ఐలకు, 11 మంది రెగ్యులర్ ఎస్ఐలకు ఏలూరు రేంజ్ పరిధిలోని కృష్ణ, కాకినాడ, ఏలూరు జిల్లాలతోపాటు ఎన్టిఆర్ పోలీస్ కమిషనరేట్, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు బదిలీలు చేశారు. మొత్తంగా 37 మంది మహిళ, పురుష ఎస్ఐలకు స్థాన చలనం జరిగింది. ఈ మేరకు ఆదేశాలను గురువారం రాత్రి విడుదల చేసినట్లు సమాచారం.

ఖరీఫ్‌లో రెండు జిల్లాల రైతాంగం తీవ్ర నష్టాలను చవిచూసింది. మిచౌంగ్ తుపానుకు రెండు జిల్లాల్లో వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగింది. సర్వం కోల్పోయిన కౌలురైతులంతా రోడ్డునపడ్డారు. పంట నష్టపరిహారం అందితే దాళ్వా పెట్టుబడులకు ఉపయోగపడతాయని అన్నదాత ఆశగా ఎదురుచూస్తున్నాడు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందజేతపై ఎటువంటి కదలిక లేకుండా పోయింది. ఎలక్షన్ నోటిఫికేషన్ వస్తే నష్టపరిహారం సొమ్ములు ఆగిపోతాయోమోనన్న భయం రైతులను వెంటాడుతోంది. వెంటనే పంట నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

పంట నష్టం ఇచ్చేదెప్పుడు..!

ఖరీఫ్‌లో రెండు జిల్లాల్లో 87 వేల ఎకరాల్లో పంట నష్టం

తుపాను దెబ్బకు తీవ్ర నష్టాలతో రోడ్డున పడ్డ కౌలురైతులు

దాళ్వా పెట్టుబడుల కోసం నానా అవస్థలు

పంట నష్టపరిహారం కోసం రైతుల ఎదురుచూపులు

ఎలక్షన్ నోటిఫికేషన్ విడుదలైతే పరిహారం అందజేతపై అనుమానాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్‌లో రెండు జిల్లాల్లోనూ దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. ఇక మొక్కజొన్న, మినుము, పత్తి, వేరుశనగ, పొగాకు, చెరకు వంటి అనేక పంటలను రైతులు వేశారు. వర్షాకాలం నాలుగు నెలల కాలంలో మూడు నెలలు వర్షాలు పడక లోటు వర్షపాతం ఏర్పడింది. ఖరీఫ్ సాగులో నీటిఎద్దడి సమస్యతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వేసవి తరహాలో ఎండలు కాచాయి. పొలాల్లో మెట్టుచుట్టుముట్టి రైతులు నానా అవస్థలు పడ్డారు. అన్ని ఒడుదుడుకులను ఎదుర్కొని ఖరీఫ్‌సాగును రైతులు ముందుకు నడిపించారు. ఎంతో సంతోషంగా ఖరీఫ్ మాసూలును రైతులు ప్రారంభించారు. పట్టుమని వారంరోజులు గడవకముందే డిసెంబర్ మొదటివారంలో మిచౌంగ్ తుపాను విరుచుకుపడింది. ఈదురుగాలులు, భారీ వర్షాలు ముంచెత్తాయి. పొలాల్లో మోకాళ్లలోతు వర్షపు నీరు నిలిచిపోయింది. ధాన్యపు రాశులన్నీ తడిసి ముద్దయిపోయాయి. పంట పొలాలన్నీ నేలకొరిగి నీటిలో తేలిఆడాయి. రైతులకు

దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. మొక్కజొన్న, మినుము, పొగాకు వంటి పంటలు సైతం దెబ్బతిన్నాయి. వర్షపు నీరు తగ్గిన తర్వాత అధికారులు పంట నష్టపరిహారం అంచనాలకు దిగారు. పశ్చిమగోదావరి జిల్లాలో 49,495 ఎకరాల్లో పంట నష్టం జరగ్గా వరి 47,657 ఎకరాలు, మినుము 1762 ఎకరాలు, వేరుశెనగ 75 ఎకరాల్లో పంట దెబ్బతింది. ఏలూరు జిల్లాలో 37,936 ఎకరాల్లో పంటనష్టం జరగ్గా వరి 22,045 ఎకరాల్లో, మొక్కజొన్న 4,366 ఎకరాలు, మినుము 241 ఎకరాలు, పత్తి 2,181 ఎకరాలు, వేరుశెనగ 938 ఎకరాలు, పొగాకు 8,160 ఎకరాలు, చెరకు రెండెకరాల్లో పంట దెబ్బతింది. రెండు జిల్లాల్లో మొత్తం 87,431 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు తేల్చి ప్రభుత్వానికి నివేదించారు. పైన చెప్పిన లెక్కలన్నీ 33 శాతానికిపైగా దెబ్బతిన్న పంటలు మాత్రమే. 33 శాతంలోపు దెబ్బతిన్న పంటపొలాలను నిబంధనల పేరుతో లెక్కల్లోకి తీసుకోలేదు. దీంతో ఎంతోమంది రైతులకు నష్టపరిహారం అందే పరిస్థితి లేకుండా పోయింది. రైతులు ఎకరాకు రూ.30 వేలకు పైగా నష్టపోయిన పరిస్థితి నెలకొంది. పంట నష్టపరిహారం కింద ప్రభుత్వం ఇచ్చే సాయం మాత్రం రూ.6 వేలు మాత్రమే. దెబ్బతిన్న పంటలకు సంబంధించి అదే ఏడాదిలో పంట నష్టపరిహారం ఇస్తున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. గడిచిన ఖరీఫ్‌లో దెబ్బతిన్న పంటలకు వెంటనే పరిహారం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దెబ్బతిన్న పంటలకు సంబంధించి నివేదికలు సమర్పించి చాలాకాలం గడుస్తున్నా ఇప్పటికీ పరిహారం జమకు సంబంధించిన కదలికలు లేకుండా పోయాయి. ఫిబ్రవరిలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. నోటిఫికేషన్ విడుదలైతే ప్రభుత్వం అధికారాలు కోల్పోతుంది. దీంతో ప్రభుత్వం వెంటనే పంట నష్టపరిహారం సొమ్ము విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. లేకపోతే పంట నష్టపరిహారం అందుతుందో లేదో అన్న భయం రైతులను వెంటాడుతోంది.

కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరం..

రెండు జిల్లాల్లో జరుగుతున్న వ్యవసాయ సాగుకు సంబంధించి 70 శాతానికి పైగా కౌలురైతులే చేస్తున్నారు. పంటను కోల్పోయిన రైతుల్లో కౌలురైతులే అధికశాతం ఉన్నారు. కాని ప్రభుత్వం ఈ క్రాప్‌లో ఉన్న పేర్లనే పంట నష్టనమోదు జాబితాలో చేర్చారు. ఈ క్రాప్‌లో భూయజమానుల పేర్లు తప్ప కౌలురైతుల పేర్లు లేవు. దీనికి ప్రధాన కారణం కౌలురైతులందరికీ కౌలుకార్డులు జారీచేయకపోవడమేనని చెప్పొచ్చు. పంటను కోల్పోయిన కౌలు రైతులకు కాకుండా భూయజమానికి పరిహారం అందే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం కౌలురైతులకు పరిహారం, బీమా అందేవిధంగా చర్యలు తీసుకోకపోతే వాస్తవ సాగుదారుడైన కౌలురైతు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడనుంది. కౌలురైతులకు నష్టపరిహారం అందజేస్తే రబీ పెట్టుబడులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రభుత్వం అందుకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

లబ్ధిదారులకు నమూనా చెక్కు అందిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

పేదల సొంతింటి సాకారమే ప్రభుత్వ లక్ష్యం

ప్రభుత్వ విప్ గ్రంధి, జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

నవరత్నాల పథకంలో భాగంగా పేదలందరికీ ఇళ్లు, లబ్ధిదారులు వడ్డీ రీయింబర్స్‌మెంటు పొందిన సొంతింటి యజమానులు కావాలన్నదే ప్రభుత్వ ఆశయమని రాష్ట్ర ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం ముఖ్యమంత్రి జగన్ తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు, లబ్ధిదారులకు వడ్డీ రీయింబర్స్ మెంట్ వారి ఖాతాల్లో వేసేందుకు బటన్ నొక్కి ప్రారంభించారు. స్థానిక కలెక్టరేట్‌లో కార్యక్రమానికి ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, సంబంధిత శాఖల అధికారులు, లబ్ధిదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ నవరత్నాల్లో భాగంగా పేదలకు ఇళ్లు, లబ్ధిదారులకు వడ్డీ రీయింబర్స్‌మెంటు ఇచ్చి సొంతింటి యజమానులు కావాలనేది చరిత్రాత్మక సంఘటన అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్రంలో ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతిల్లు ఉండాలన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల నిరుపేద కుటుంబాలు సొంతిల్లు కలిగి ఆర్థికంగా ముఖ్యవృద్ధి చెంది, సమాజంలో గౌరవంగా నిలబడాలనే ఉద్దేశంతో ఈ బృహత్తర పథకం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. అనంతరం జిల్లాలో 16,469 మందికి రూ.2.49 కోట్ల నమూనా చెక్కును లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి, డిప్యూటీ ట్రైనీ కలెక్టరు కానాల సంగీత్ మాధుర్, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి ఆర్‌సి.ఆనంద కుమార్ పాల్గొన్నారు.

నేడు యుటిఎఫ్ ఆధ్వర్యాన నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి - భీమవరం

ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రభుత్వం బాకీ ఉన్న బకాయిల మంజూరు కోసం యుటిఎఫ్ చేపట్టిన పోరుబాట మలిదశలో భాగంగా ఈనెల 19న భీమవరంలో నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయ రామరాజు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. యుటిఎఫ్ జిల్లా కార్యాలయం నుంచి నిరసన ప్రదర్శన ప్రారంభమవుతుందని తెలిపారు. యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు అందరూ కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శిక్షణ త్వరగా పూర్తిచేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

రానున్న సాధారణ ఎన్నికలకు సంబంధించి అన్ని విభాగాల సిబ్బందికీ శిక్షణ కార్యక్రమాలను త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఎన్నికల అధికారులతో సమావేశమై ఎన్నికల ప్రక్రియలో భాగంగా నిర్వహించే వివిధ శిక్షణా కార్యక్రమాలపై మాస్టర్ ట్రైనర్స్‌తో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. సమిష్టి కృషితో పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. దీనిలో భాగంగా మోడల్ కోడ్ ఆఫ్ కండాక్ట్ అప్లికేషన్లు, పోస్టల్ బ్యాలెట్, వివిధ మీడియా ప్రసారం ఆధ్వర్యంలో ప్రసారమయ్యే ప్రతికూల వార్తలు, అభ్యర్థుల ఖర్చుల వివరాలు లెక్కింపు, తదితర అంశాలపై సిబ్బందికి శిక్షణ పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ కె.చెన్నయ్య, సిపిఒ కె.శ్రీనివాసరావు, డిఆర్‌డిఎ పీడీ ఎన్‌విఎస్.ప్రసాద యాదవ్, డ్వామా పీడీ ఎస్‌టివి రాజేశ్వరరావు, డిఎస్‌పి సి.శరత్ రాజకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఇఇలు పి.శ్రీనివాసరావు, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

20న భూ హక్కు చట్టంపై రౌండ్ టేబుల్ సమావేశం

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూ హక్కు చట్టం భూ దోపిడీ చట్టమని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఈ నెల 20న భూ హక్కు చట్టంపై సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలు, లాయర్స్ సంఘాలు, వివిధ సంస్థల సభ్యులు ఈ సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించండి

కార్మిక సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - భీమవరం

తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు చేపట్టిన సమ్మె విజయవంతంగా కొనసాగుతోందని, ఇప్పటికైనా ప్రభుత్వం వారి సమస్యలు పరిష్కరించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ప్రభుత్వం తగు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించాయి. చర్చల పేరుతో కాలయాపన చేయకుండా సమస్యల పరిష్కారానికి నిర్దిష్ట హామీతో పాటు జిఒలు విడుదల చేయాలని డిమాండ్ చేశాయి. భీమవరంలో గురువారం కార్మిక సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్ రాయ్ మాట్లాడారు. అంగన్వాడీలు ఆవేదనతో చేపట్టిన సమ్మె మాటల ద్వారా పరిష్కారం కాదని, వేతనాలు పెంచడం ద్వారానే పరిష్కారమవుతుందని తెలిపారు. ప్రభుత్వం పెట్టిన నిర్బంధాలు, అరెస్టులు, తాళాలు బద్దలు కొట్టడాలు వంటి అనేక చర్యలను ఎదుర్కొని సమ్మెను కొనసాగిస్తున్నారన్నారు. చివరికి క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి వంటి పండుగ రోజుల్లో కూడా ఆందోళనలోనే ఉన్నారన్నారు. ఎఐటియుసి జిల్లా నాయకులు చెల్లబోయిన

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాయ్

రంగారావు మాట్లాడుతూ పలు దఫాల చర్చలకు పిలిచి అన్ని హామీలూ నెరవేరుస్తున్నామని ప్రభుత్వం చెప్పడమే తప్ప తెలంగాణ కన్నా వెయ్యి రూపాయలు అదనంగానే ఇస్తామన్న హామీకి సమాధానం చెప్పకపోవడం సిగ్గుచేటు అన్నారు. టియుసిసి నాయకులు దండు శ్రీనివాసరాజు, ఎఐసిటియు నాయకులు బంగారు పెద్దిరాజు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించడం ద్వారా సమ్మె ఆగుతుందని ప్రభుత్వం సత్వరమే చర్యలు తీసుకోవాలన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్ మాట్లాడుతూ నిన్నటి నుంచి నిరవధిక దీక్షలకు అంగన్వాడీలు సిద్ధమయ్యారంటే వారికి ఎంత బాధ ఉందో ప్రభుత్వం గమనించాలన్నారు. అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక దీక్షలకు మద్దతుగా పలు ఆందోళన కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా కార్మిక సంఘాలు చేపట్టాలని నిర్ణయించాయని తెలిపారు. సమావేశంలో సిఐటియు నాయకులు వాసుదేవరావు, ఎం.ఆంజనేయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గోపీమూర్తి

ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు చెల్లించాలి

దశలవారీ పోరాటం

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

ప్రజాశక్తి - పాలకొల్లు

ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ 19న తాలూకా స్థాయి, 24న జిల్లాస్థాయిలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి చెప్పారు. పాలకొల్లు సమతా మహిళ భవనంలో గురువారం నిర్వహించిన పాలకొల్లు, నరసాపురం, మార్టేరు డివిజన్ల ముఖ్య బాధ్యుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జనవరి 31 నుంచి ఫిబ్రవరి మూడో తేదీ వరకు జిల్లా కేంద్రాల్లో నిర్వహించే రిలే నిరాహార దీక్షలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆర్థిక బకాయిలపై ప్రభుత్వం స్పందించని పక్షంలో ఫిబ్రవరిలో రాష్ట్రస్థాయిలో పెద్ద ఎత్తున కార్యక్రమం చేపడతామని, ఓట్ ఫర్ ఓపిఎస్ కార్యక్రమాన్ని జనవరి 28న రాష్ట్రస్థాయిలో రాజమండ్రిలో నిర్వహిస్తున్నామని చెప్పారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి నిరసనగా జనవరి 25న విజయవాడలో రాష్ట్రస్థాయి ధర్నా చేపడుతున్నామని తెలిపారు. ఈ దశలవారి పోరాటంలో ఉద్యోగ ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి చొరవ చూపకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకపోగా ఉపాధ్యాయుల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసేలా చర్యలు తీసుకుంటున్నారని విమర్శించారు. ఈ సమావేసానికి జిల్లా సహాధ్యక్షులు కె.రాజశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.మార్కండేయులు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు జి.లక్ష్మీనారాయణ, పి.క్రాంతికుమార్, పి.కృష్ణకుమారి, ఎం.శ్రీనుబాబు, జి.రామకృష్ణంరాజు, కె.శ్రీరామకృష్ణప్రసాద్, ఎం.శ్రీనుబాబు, కెఎస్‌సి హెచ్.సాయిరాం, సిహెచ్.కుమార్, బాబ్జి, డి.ఏసుబాబు, రాష్ట్ర కౌన్సిలర్లు కేతా వెంకటేశ్వరరావు, ఎంవి.రాజశేఖర్, పిల్లి శ్రీనివాసరావు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు పులఖండం శ్రీనివాస్, జిఎస్ఎస్ఆర్.స్వామి, మండల పట్టణ శాఖల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గుత్తిందీవి శ్రీనివాసరావు, పంతం రామమూర్తి నాయుడు, దాసరి క్షేమమూర్తి, కేత నాగరాజు, ఎస్.రాంజీకుమార్, కె.త్రినాథ్, జి.ప్రకాశరావు, ఎన్‌వి.సత్యనారాయణ, ఎస్.అజయ్‌కుమార్, పి.మాణిక్యాలరావు, ఎన్.చంద్రకుమార్, జి.శ్రీనివాస్, సిహెచ్.శ్రీనివాస్, వి.జగ్గారావు, బి.రాజు పాల్గొన్నారు.

తణుకు రూరల్ :ఆర్థిక బకాయిలు చెల్లించే వరకూ పోరాటం కొనసాగిస్తామని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి అన్నారు. యుటిఎఫ్ ప్రాంతీయ సమావేశం జిల్లా కార్యదర్శి టిజె.జయకుమార్ అధ్యక్షతన తణుకు ఎన్‌జిఒ హోమ్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన గోపీమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయులకు పిఆర్‌సి, డిఎ, పిఎఫ్, ఎపిజిఎల్ఐ, సరెండర్ లీవు పలు బాకీలు రూ.18,096 కోట్ల చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే బకాయిల విడుదల కోసం దశలవారీ పోరాటంలో భాగంగా ప్రజాప్రతినిధులకు మెమోరాండంలు ఇచ్చామని, డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ధర్నాలు నిర్వహించామని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు సిహెచ్.నాగశిరోమణి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ఎంవి.రాజేష్, తణుకు టౌన్ బాధ్యులు ఆర్.కర్నేలు, ఇరగవరం మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.గౌతమ్, ఎం.వీరరాఘవులు, అత్తిలి మండల ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు, తణుకురూరల్ బాధ్యులు బి.సురేష్, ఎస్.సురేష్, తాడేపల్లిగూడెం రూరల్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్‌కె.వెంకనసాహెబ్, కెవి.రామకృష్ణ, పెంటపాడు అధ్యక్షులు పి.రామకృష్ణ, సురేష్ పాల్గొన్నారు.

మొండి వైఖరి వీడకుంటే గద్దె దించుతాం

38వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

ప్రజాశక్తి - కాళ్ల

ప్రభుత్వం ఇప్పటికైనా మొండి వైఖరి వీడనాడి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు రాజా రామ్మోహన్‌రాయ్ అన్నారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ నాయకులు ఝాన్సీరాణి, హైమావతి, శ్యామల, రాణి, సిఐటియు మండల అధ్యక్షులు గొర్ల రామకృష్ణ పాల్గొన్నారు.

గణపవరం : గణపవరంలో గురువారం 38వ రోజు సమ్మె కొనసాగింది. అంగన్వాడీ మండల కమిటీ నాయుకులు బి.రామకోటి మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించేవరకూ పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీతామహాలక్ష్మి, సిహెచ్.మహాలక్ష్మి, జయలక్ష్మి, బండారు మహాలక్ష్మి, బండారు పార్వతి పాల్గొన్నారు.

పాలకోడేరు : పాలకోడేరులో అంగన్వాడీలు చేపట్టిన

పాలకోడేరులో...

సమ్మె గురువారంతో 38వ రోజు కొనసాగింది. అంగన్వాడీలు శిబిరంలో కూర్చుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమస్యలు పరిష్కరించేవరకూ సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు విజయలక్ష్మి, విమల, విమలకుమారి, వెంకటలక్ష్మి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

భీమవరంలో...

పోడూరు : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీల సమ్మె గురువారం 38వ రోజు కొనసాగింది. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ లీడర్ పీతల రాజమణి, రాయుడు కుమారి, జె.ఉమాదేవి పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : భీమవరంలో అంగన్‌వాడీలు ఖాళీ కంచాలతో నిరసన తెలిపారు. సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ మద్దతు తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దుర్గ, మేరీ గ్రేస్, సీతారత్నంచ అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉండి : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద చేస్తున్న సమ్మె గురువారంతో 38వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్వాడీలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమను ఎన్ని ఇబ్బందులకు గురి చేసినప్పటికీ సమ్మె విరమించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెనుగొండలో...

ఆచంట (పెనుమంట్ర) : విజయవాడ నిరవధిక నిరాహార దీక్షకు సంఘీభావంగా పెనుమంట్ర మండలం నుంచి సుమారు 20 మంది అంగన్వాడీలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి.చిన్నవీరభద్రం, అంగన్వాడీ మండల సహాయక కార్యదర్శి ఎం.సాయిమహాలక్ష్మి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పద్మావతి, అక్షిత, చంద్రకళ, సూర్యప్రభ కనకదుర్గ, రమణ, దుర్గ పాల్గొన్నారు. కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కూసంపూడి సుబ్బరాజు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయ్‌కుమార్ సంఘీభావం తెలిపారు.

పెనుగొండ : పెనుగొండలో అంగన్‌వాడీలు సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్.గంగారావ్, మాదాసు నాగేశ్వరరావు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరులో చేపట్టిన దీక్ష 38వ రోజు గురువారం కొనసాగింది. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు పెద్దింట్లు, సారమ్మ, సీత నాగలక్ష్మి, రేఖ శాంభవి పాల్గొన్నారు.

30, 31 తేదీల్లో కల్లు గీత కార్మిక సంఘం మహాసభ

ప్రజాశక్తి - ఇరగవరం

కల్లు గీత వృత్తి రక్షణకు, ఉపాధి కోసం జరిగే 15వ రాష్ట్ర మహా సభను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి గీత కార్మికులకు పిలుపునిచ్చారు. ఇరగవరం మండల కేంద్రంలో గీత కార్మికుల సమక్షంలో మహాసభ కరపత్రాలను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో వేలాదిమంది గీత కార్మికులు కల్లుగీత వృత్తిపై ఆధారపడి ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గీత వృత్తి సంక్షేమానికి ఎటువంటి నిధులు కేటాయించకుండా వృత్తిని నాశనం చేసేలా చేసిందన్నారు. కల్లు గీత కార్మికులు కల్లు గీసుకునే చెట్లను రియల్ ఎస్టేట్ వాళ్లు నరికి వేస్తున్నారన్నారు. ప్రభుత్వం కల్లు అమ్ముకోవడానికి సకాలంలో లైసెన్స్, గుర్తింపు కార్డులు ఇవ్వడంలేదన్నారు. గీత వృత్తి కార్పొరేషన్ తీసివేసి కార్మికుల సంక్షేమాన్ని గాలికొదిలేసిందన్నారు. ఈ మహాసభలో గీత కార్మికుల వృత్తి గురించి చర్చించి రానున్న కాలంలో పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం అధ్యక్షులు కామన మునిస్వామి, జిల్లా కమిటీ సభ్యులు పిల్లి ఏడుకొండలు, కల్లుగీత సహకార సొసైటీలు అధ్యక్షుడు వీరవల్లి వెంకటేశ్వరరావు, పాలా సత్యనారాయణ, పెచ్చేటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

నేటి నుంచి కులగణన ప్రారంభం

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

సమాజంలో వివిధ తరగతుల స్థితిగతులను తెలుసుకునే లక్ష్యంతో ప్రభుత్వం మరో చారిత్రక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, దీనిలో భాగంగా శుక్రవారం నుంచి జిల్లాలో కులగణన చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో జిల్లాలో చేపట్టనున్న కులగణనపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ గురువారం సమీక్షించారు. ఈ నెల 19వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కులగణన ప్రారంభం కానుందని, దేశంలో బీహార్ తరువాత కులగణన చేపడుతున్న రెండో రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ కావడం విశేషమన్నారు. బీహార్‌లో కేవలం కొన్ని కులాల జనాభా వివరాలను మాత్రమే సేకరించగా, పూర్తిస్థాయిలో కులగణన చేపడుతున్న తొలిరాష్ట్రం మనదే అని తెలిపారు. జిల్లాలోని 20 మండలాలు, ఐదు మున్సిపాలిటీలు, ఒక నగర పంచాయతీలోని 6,40,610 గృహాలకు సంబంధించి సుమారు 20,68,500 జనాభా ప్రాతిపదికన కులగణన చేపట్టనున్నట్లు తెలిపారు. దీనికోసం 7,051 మంది ఎన్యూమరేటర్లను, 1,107 మంది సూపర్వైజర్లను నియమించినట్లు తెలిపారు. జిల్లాలో ఈ సర్వే పకడ్బంధీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ విధాన నిర్ణయాలను రూపొందించడానికి, సంక్షేమ పథకాలను అమలు చేయడానికి ఈ సర్వే వివరాలు దోహదపడతాయన్నారు.

సచివాలయ సిబ్బంది ద్వారా గణన

గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా కులగణన సర్వే నిర్వహించడానికి రంగం సిద్ధం చేసినట్లు చెప్పారు. ఈ నెల 19వ తేదీ నుంచి 28 వరకు పది రోజుల పాటు మొబైల్ యాప్ ద్వారా డోర్ టూ డోర్ సర్వే నిర్వహిస్తారని రెవెన్యూ, పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖ, ప్లానింగ్, సంక్షేమ శాఖల నుంచి ఎంపిక చేసిన సూపర్‌వైజర్లు, మండల ప్రత్యేకాధికారులు పర్యవేక్షిస్తారన్నారు. ఈ సమావేశంలో జిల్లా ముఖ్య ప్రణాళికాధిరి కె.శ్రీనివాసరావు, గ్రామ వార్డు సచివాలయాలు అధికారి కెసిహెచ్.అప్పారావు, ఆర్‌డిఒలు, సోషల్ వెల్ఫేర్, బిసి వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు, మండల స్పెషల్ ఆఫీసర్లు, నియోజవర్గాల స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

నరసాపురం : కులగణనకు ప్రజలందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ హాలులో తహశీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్‌లతో కలిసి నోడల్ ఆఫీసర్లకు, సచివాలయ సిబ్బందికి గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ కులగణనక సంబంధించి క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు తెలుసుకునేందుకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వి.శేషగిరి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని రుస్తుంబాద శ్రీ గోగులమ్మ ఉత్సవ కమిటీ, కొత్తపల్లి సోదరుల ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఈ కబడ్డీ పోటీలకు 18 రాష్ట్రాల నుంచి జట్లు వచ్చాయి. విజేతలకు రూ.5 లక్షలు ప్రైజ్ మనీ అందించనున్నారు. స్త్రీ, పురుష జట్లకు వేరుగా మొదటి బహుమతి రూ.లక్ష, రెండో బహుమతి రూ.75 వేలు, మూడో బహుమతి ఉరూ.50 వేలు, నాలుగో బహుమతి రూ.25 వేలు, షీల్డులు అందిస్తారు.

కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

మార్చి 3 నుంచి జాతీయ స్థాయి నాటికల పోటీలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు కళా పరిషత్ 15వ జాతీయ స్థాయి నాటికల పోటీలు మార్చి 3, 4, 5 తేదీల్లో నిర్వహించనున్నట్లు పాలకొల్లు కళా పరిషత్ అధ్యక్షులు కెవి.కృష్ణ వర్మ తెలిపారు. స్థానికంగా గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి నాటికకు రూ.15 వేలు ప్రదర్శన పారితోషికం ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు నగదు బహుమతులు అందిస్తామని వర్మ తెలిపారు. వ్యక్తిగత బహుమతులు, మెమెంటోలు బహుకరించనున్నట్లు గౌరవ అద్యక్షులు మేడికొండ శ్రీనివాస్ తెలిపారు. అనంతరం సినీ నిర్మాత బన్నీ వాసును కలిసి పరిషత్‌కు ఆహ్వానించినట్లు కార్యదర్శి జక్కంపూడి కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ కెఎస్‌పిఎన్.వర్మ, విఠాకుల రమణ, మానాపురం సత్యనారాయణ, కొణిజేటి గుప్త, షేక్ పీర్ సాహెబ్, నడపన శ్రీనివాసరావు, కొల్లి ప్రసాద్, సోమంచి శ్రీనివాసశాస్త్రి, అంగర కుమార్, రెడ్డి వాసు, జిఎస్ఎన్.రవి పాల్గొన్నారు.

బిఎల్‌ఒలు సమర్ధవంతంగా పని చేయాలి

ప్రజాశక్తి - పోడూరు

రానున్న ఎన్నికలకు సంబంధించి పోలింగ్ బూత్ స్థాయి అధికారులు తమ విధులను సక్రమంగా సమర్ధవంతంగా నిర్వర్తించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్‌టివి.రాజేశ్వరరావు అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో బిఎల్‌ఒలకు గురువారం నిర్వహించిన అవగాహనా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల విధులను తేలికగా భావించవద్దని, జవాబుదారీతనం కలిగి ఉండాలని చెప్పారు. ఓటర్ల జాబితాను ఒకటికి రెండు సార్లు సరిచూసి లోపాలు ఏమైనా కనుగొంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఓటర్ల జాబితాలో తప్పొప్పులు ఉంటే రాజకీయ పక్షాలు అడుగుతారని, అందుకు తగు జాగ్రత్త వహించాలని చెప్పారు. ఈ అవగాహన సమావేశంలో తహశీల్దార్ పివి.కృష్ణారావు, ఆర్‌ఐలు కె.రాంబాబు, ఎస్ఎ.త్రిమూర్తులు, డిటి.రాజేష్, మండలంలోని బిఆర్‌ఒలు, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి - గణపవరం

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు తప్పుతాయని నిడమర్రు ఎస్ఐ జి.శ్రీనివాస్ అన్నారు. నిడమర్రులో యువతకు ట్రాఫిక్ నిబంధనలపై గురువారం అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించి ప్రాణరక్షణకు భద్రత కల్పించుకోవాలన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - ఉండి

ప్రజల ఆరోగ్య శ్రేయస్సు లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎన్‌ఆర్‌పి అగ్రహారం గ్రామ సర్పంచి సురవరపు కనకదుర్గ వెంకటాచార్యులు అన్నారు. మండలంలోని ఎన్‌ఆర్‌పి అగ్రహారంలో గురువారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య సేవలు లభించని మారుమూల పల్లెల్లో వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి వైద్య సేవలందించేలా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకుని వారికి కావాల్సిన వైద్య సేవలు పొందాలని ఆమె సూచించారు. వైద్య సేవలతో పాటు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి వారికి కావాల్సిన మందులను కూడా ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు పంచాయతీ పరిధి నల్లంవారితోట సమీపంలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. ఎఎస్ఐ బండి సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణా జిల్లా ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామం నుంచి తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురానికి ధాన్యం లోడుతో లారీ బయలుదేరింది. శ్రీకాకుళం గ్రామానికి చెందిన మాదాసు నాగబాబు, మరో వ్యక్తి రావులపాలెం వరకు వెళ్లేందుకు ఆ లారీని ఎక్కారు. ఈ క్రమంలో లారీ నల్లంవారితోట సమీపంలోకి వచ్చేసరికి జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న మరో లారీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మాదాసు నాగబాబు (35) సంఘటనా ప్రాంతంలోనే మృతి చెందాడు. మరో వ్యక్తికి, డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. నాగబాబు సోదరుడు మాదాసు సీతారాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

అస్థవ్యస్థంగా ఉన్న డ్రెయినేజీ వ్యవస్థ

అధ్వానంగా సంతమార్కెట్ ప్రాంతం

అభివృద్ధికి ఆమడ దూరంలో పెనుగొండ

నెరవేరని సంతమార్కెట్ హామీ

అస్థవ్యస్థంగా డ్రెయినేజీ వ్యవస్థ

అధ్వానంగా రోడ్లు

ప్రజల ఇబ్బందులు

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలోని మేజర్ పంచాయతీగా ఉన్న పెనుగొండ ఐదు సచివాలయాల పరిధిలో సుమారు 18 వేల ఓటర్లు ఉన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా పెనుగొండ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలతో సతమతమవుతూ ప్రజలు అవస్థలు పడుతున్నారు. పెనుగొండ సంత మార్కెట్‌ను అభివృద్ధి చేస్తామని ప్రజా ప్రతినిధులు హామీలిచ్చి మళ్లీ ఇటువైపు కన్నెత్తి చూడకపోవడంతో వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రెయినేజీ నిర్మిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడంతో అవస్థలు తప్పడంలేదు. మురుగునీరు పంట బోదెల్లోకి వెళ్లడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటలు పండించుకోవడానికి అవస్థలు పడుతున్నారు. ఆదాయం మున్సిపాలిటీ స్థాయిలో ఉన్నా అభివృద్ధి శూన్యమని ప్రజలు వాపోతున్నారు. ఆర్‌టిసి బస్టాండ్ ఉన్నా సురభి కాంప్లెక్స్ లేకపోవడంతో మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు నిలిచి దోమల సంచారం పెరిగిపోతుందని ప్రజలు వాపోతున్నారు. దీంతో అనారోగ్యానికి గురవుతామని భయాందోళనకు గురవుతున్నారు. రోడ్లు కూడా పలు చోట్ల అధ్వానంగా ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రయాణికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి పెనుగొండ అభివృద్ధికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా బస్టాండ్ మరుగుదొడ్లు

జాతీయ స్థాయి పోటీలకు పెదతాడేపల్లి విద్యార్థులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ముందస్తు గణతంత్ర వేడుకల్లో జాతీయ స్థాయి స్కూల్ బ్యాండ్ పోటీల్లో పాల్గొనేందుకు పెదతాడేపల్లి అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ఢిల్లీకి బయలుదేరారని ప్రిన్సిపల్ బి.రాజారావు తెలిపారు. ఢిల్లీలోని మేజర్ ధ్యాన్‌చంద్ జాతీయ స్టేడియంలో ఈ నెల 21, 22 తేదీల్లో జాతీయ స్థాయి స్కూల్ బ్యాండ్ కాంపిటీషన్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సౌత్ జోన్ తరపున పెదతాడేపల్లి గురుకుల పాఠశాల విద్యార్థులు ఆ పోటీల్లో పాల్గుంటారని తెలిపారు. కేంద్ర విద్యాశాఖ, రక్షణ శాఖ ఆధ్వర్యంలో దేశ నలుమూలల నుంచి సుమారు 16 బ్యాండ్ టీమ్‌లు, 457 మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. గత నెలలో అన్నమయ్య జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం, కేరళ రాష్ట్రంలో సౌత్ జోన్ స్థాయిలో ప్రథమ స్థానం లభించడంతో నేషనల్ స్థాయి పోటీల్లో పాల్గొనడానికి అవకాశం లభించిందన్నారు.

'కోర్టు తీర్పులను వక్రీకరించడం తగదు'

ప్రజాశక్తి - భీమవరం రూరల్

అత్యుత్తమ న్యాయస్థానాల న్యాయమూర్తుల తీర్పులను వక్రీకరించడం తగదని రాజ్యసభ మాజీ సభ్యురాలు టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి తెలిపారు. కోర్టు తీర్పులను కొన్ని పత్రికలు టీవీ ఛానల్స్ వక్రీకరించి దిగజారుడు వార్తలను ప్రచారం చేస్తున్నాయన్నారు. చంద్రబాబుపై పెట్టిన స్కిల్ కేసులో నేటి వరకు కనీస ఆధారాలను కూడా సిఐడి నిరూపించలేకపోయిందన్నారు. కోర్టు తీర్పులను వక్రీకరిస్తూ ప్రకటనలు చేస్తున్న ఎజి పొన్నవోలు వ్యాఖ్యలు ఆయన అవివేకానికి నిదర్శనమున్నారు. కోడి కత్తి కేసులో జగన్ ఐదేళ్లుగా కోర్టులకు హాజరు కాకుండా దళిత యువకుడిని జైల్లో మగ్గపెడుతున్నారన్నారు. 32 కేసుల్లో 3500 వాయిదాలు జగన్ ఎలా పొందగలిగారన్నారు.

ఒంటి కాలిపై నిలబడి న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి - తణుకు రూరల్

భూ హక్కు యాక్టు 27తో ప్రభుత్వం ప్రజలను కుంటివాళ్లను చేసిందని తణుకు బార్ అసోసియేషన్ న్యాయవాదులు తెలిపారు. ఈ మేరకు గురువారం న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి ఒంటి కాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రమూ చేయని చీకటి చట్టాన్ని మన రాష్ట్ర ప్రభుత్వం చేయడం దుర్మార్గమైన విషయమన్నారు. ఈ చట్టం వల్ల భూ యజమానులకు పూర్తిస్థాయిలో నష్టం జరుగుతుందన్నారు. చట్టాలపై అవగాహన లేని ప్రభుత్వ అధికారులు చట్టాన్ని అమలు చేయడమంటే ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాయడమే అని అన్నారు. ఇది కేవలం ప్రజల హక్కులపై రాజకీయ నాయకుల దాడి అన్నారు. ఈ చట్టాన్ని రద్దు చేసే వరకూ న్యాయవాదులు పోరాడతారని, ప్రజలను చైతన్యం చేసి ప్రజా పోరాటానికి సిద్ధమవుతారని, న్యాయవాదులు ప్రభుత్వానికి తెలిపారు. ఈ చట్టం రద్దు చేసే వరకూ పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్.విజయ్‌కుమార్, కొండా శ్రీనివాసు, కౌరు వెంకటేశ్వర్లు, పోట్ల శ్రీనివాసు, సరళ, ఎం.ప్రతాప్‌కుమార్, ఎం.నాగార్జున దాసు, కామన మునిస్వామి పాల్గొన్నారు.

ఒంటికాలిపై నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

20న మొగల్తూరులో ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - మొగల్తూరు

కీర్తిశేషులు, కేంద్ర మాజీ మంత్రి రెబల్‌స్టార్ యువి.కృష్ణంరాజు జయంతి సందర్భంగా ఈ నెల 20వ తేదీన మొగల్తూరులో నిర్వహించే ఉచిత మెగా షుగర్ వ్యాధి చికిత్స శిబిరాన్ని విజయవంతం చేయాలని ఆయన భార్య ఉప్పలపాటి శ్యామలాదేవి కోరారు. గురువారం ఆమె నివాసంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అజాత శత్రువుగా పేరుగాంచిన కృష్ణంరాజుకు మొగల్తూరు అంటే ఎనలేని ప్రేమ, అని దీంతో ఆయన జయంతిని పురస్కరించుకుని పేదలకు అందుబాటులో లేని రూ.లక్షల వ్యయంతో కూడిన షుగర్ వ్యాధితో గాయాలైనవారికి ఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. పాదాల పగుళ్లు, మచ్చలు, గాయాలు, పుండ్లు, స్పర్శ కోల్పోవడం పలు లక్షణాలున్నవారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కృష్ణంరాజుపై ఉన్న అభిమానంతో లండన్‌కు చెందిన ప్రముఖ డైయాబెటిక్ ఫుట్ సర్జన్ డాక్టర్ వేణు ఈ శిబిరంలో వైద్య సేవలందించేందుకు ప్రత్యేకంగా వస్తున్నారన్నారు. లండన్, అబుదబి, హైదరాబాద్, విజయవాడ, భీమవరానికి చెందిన సుమారు 30 మంది ప్రముఖ వైద్యులు ఈ శిబిరంలో సేవలందించనున్నారన్నారు. ఇకపై యూకె ఇండియా డయాబెటిక్ ఫుట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా వైద్య సేవలు కొనసాగిస్తామన్నారు. తమ కుటుంబ వారసుడు హీరో ప్రభాస్, తన ముగ్గురు కుమార్తెలు కృష్ణంరాజు పేరిట విద్య, వైద్య సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు సహకరిస్తున్నారన్నారు. తన ప్రథమ కుమార్తె సాయి ప్రసిద్ధ మొగల్తూరులో నిర్వహించే మెగా క్యాంపునకు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. తొలుత కృష్ణంరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో దాసరి బాబి, పిఎంపి వైద్య సంఘ నాయకులు కెఎస్‌పిఎన్.ముక్తేశ్వరరావు, పులపర్తి రమేష్, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

వేగవంతంగా భీమవరం పట్టణాభివృద్ధి

ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణంలోని 29వ వార్డులో రూ.1.72 కోట్ల నిధులతో నిర్మించిన అభివృద్ధి పనులను ఆయన గురువారం ప్రారంభించారు. తొలుత రూ.31.50 లక్షలతో సంజీవయ్య నగర్ కెనాల్ రోడ్డు వెంబడి నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం రూ.66.20 లక్షలతో ప్రకాష్‌నగర్‌లో నిర్మించిన సీసీ రోడ్డును, రూ.76 లక్షలతో నిర్మించిన సంజీవయ్య నగర్‌లో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరం పట్టణాన్ని వేగవంతంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. భీమవరం నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నానన్నారు. యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన వంతెనలకు అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి సంబంధించి రూ.36 కోట్ల నిధులను మంజూరు చేయించడంతో పాటు టెండర్ ప్రక్రియ కూడా జరుగుతుందన్నారు. వచ్చే నెల రెండో తేదీ వరకు టెండర్ ప్రక్రియ జరుగుతుందన్నారు. అవగాహన, అజ్ఞానం లేని కొంతమంది వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, మేడిది జాన్సన్, గాదిరాజు సుబ్రహ్మణ్యరాజు, కామన నాగేశ్వరరావు, పిప్పళ్ల నాని, ఎలకల ధర్మారావు, నాగిడి జయలక్ష్మి, కొప్పర్తి వీర రాఘవులు, చిన్నమిల్లి వెంకటరాయుడు, వంకా చందు, తలారి హనుమంతరావు, ఉయ్యూరి వెంకన్న, బొర్రా వాసు, ముద్దే రామభద్రగౌడ్, ముత్యాల బుజ్జి, గంట సుందర్‌కుమార్, కొట్టి కుటుంబరావు, పాలపర్తి జోనా, కందిగట్ల ఎడ్వర్డ్, చల్లబోయిన సూర్యప్రకాష్, నడింపల్లి అశోక్‌వర్మ, గాదిరాజు రామరాజు, నందమూరి ఆంజనేయులు, తాళ్లూరు చంటి, కోయ శ్రీరామమూర్తి, పూజారి రంగరాజు, ఎడ్ల పుష్ప, ఉయ్యూరు శ్రీనివాస్ పాల్గొన్నారు.

చిరస్మరణీయులు ఎన్‌టిఆర్

వర్ధంతి సభల్లో వక్తలు

ప్రజాశక్తి - మొగల్తూరు

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతిని మండలంలోని పలు గ్రామాల్లో గురువారం నిర్వహించారు. మండల కేంద్రమైన మొగల్తూరులోని గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో రామరాజ్యం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మామిడిశెట్టి సత్యనారాయణ, కత్తిమండ ముత్యాలరావు, బస్వాని ఏడుకొండలు, పొన్నపల్లి శివ, పాల రాంబాబు, గోపాలం, వెలిది పుల్లారావు పాల్గొన్నారు.

ఉండి : రక్తదానం చేయడం వల్ల నలుగురి ప్రాణాలు కాపాడినవారవుతారని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. ఉండి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు చెన్నంశెట్టి హరినాయుడు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఎల్ఎ మంతెన రామరాజు మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల నలుగురికి ప్రాణాలు పోసిన వారవుతారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి జుత్తిగ శ్రీనివాస్, పార్టీ మండలాధ్యక్షులు కరిమెరక నాగరాజు, ఉపాధ్యక్షులు పేరిచర్ల కృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న, నాయకులు కట్టా రాంబాబు, ముగ్గళ్ల సత్యనారాయణ, మజ్జి కృష్ణప్రసాద్, గొట్టం వెంకటేశ్వరరావు, రామభద్రరాజు, తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు.

ఉండి : ఉండి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షుడు కరిమెరక నాగరాజు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జుత్తిగ శ్రీనివాస్, పార్టీ మండలాధ్యక్షుడు నాగరాజు, నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న, కాగిత వెంకట సత్యనారాయణ, గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ, ముగ్గళ్ల సత్యనారాయణ, మజ్జి కృష్ణప్రసాద్, ముదునూరి కృష్ణంరాజు, కాగిత మహంకాళి, కునుకు శ్రీనివాస్, గొట్టం బాబి, మంతెన సాయి లచ్చిరాజు, దూసనపూడి రాంబాబు పాల్గొన్నారు.

పాలకోడేరు : పాలకోడేరులో టిడిపి ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ వర్ధంతి నిర్వహించారు. ఎన్‌టిఆర్ చిత్రపటానికి మండలాధ్యక్షులు దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు దొంగ కృష్ణ, సీనియర్ నాయకులు సిహెచ్.వెంకటేశ్వర్లు, కడిమి సత్యనారాయణ, జివి.సత్యనారాయణ, సిహెచ్.మోహన్‌రావు, ఇళ్ల నాగబాబు, ఇళ్ల పండు, సువర్ణరాజు, జి.రామకృష్ణ, జి.శ్రీను, దొంగ భారతి, ప్రధాన కార్యదర్శి మాధవరావు పాల్గొన్నారు.

గణపవరం : ఎన్‌టిఆర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని తెలుగుదేశం గణపవరం పట్టణ అధ్యక్షులు కోసంపూడి సురేంద్రకుమార్‌రాజు అన్నారు. స్థానిక పంచాయతీ వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కాపవరం చిన్నపల్లి వెంకటేశ్వరరావు, షేక్ బషీరుద్దీన్, కడ గళ్ల చిన్న పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : ఎన్‌టిఆర్ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల మల్లికార్జునరావు (బాబ్జి), టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు పట్నాల రాంపండు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు గంధం సతీష్ పాల్గొన్నారు.

పెనుగొండ : స్థానిక టిడిపి కార్యాలయంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ సర్పంచి నక్కా శ్యామల సొని, కటికిరెడ్డి నానాజీ, వేంద్ర రాము, ఎం.వెంకటేష్, ఎం.ప్రసాద్, చలుమూరి చంద్రశేఖర్, రొక్కాల సురేష్, రవికుమార్, కట్టా గణేష్, కిషోర్, కవురు శ్రీను పాల్గొన్నారు.

ఆచంట : మండలంలోని ఆచంట, కొడమంచిలి, కోడేరు, పెదమల్లం, వల్లూరు, భీమలాపురం, శేషమ్మ చెరువు, అయోధ్యలంక గ్రామాల్లో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ఉప్పలపాటి సురేష్ బాబు మాట్లాడారు. అనంతరం పేదలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, వైస్ ఎంపిపి తాళం శ్రీనివాసరావు, నాయకులు బీరా నరసింహమూర్తి, ప్రసాద్, బోడపాటి దుర్గాప్రసాద్, కేతా మురళి, చిలుకూరి వీరవెంకటసత్యనారాయణ, ఏడిద శ్రీనివాస్, రమేష్, సత్యనారాయణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాలకొల్లు : ప్రభుత్వాసుపత్రిలో రోగులకు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ ఆధ్వర్యంలో పండ్లు, రొట్టెలు అందించారు. రక్తదాన శిబిరం నిర్వహించారు.

నాగలక్ష్మీదుర్గకు అభినందన

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్రాస్‌కంట్రీ(ఉమెన్) ఇంటర్ కాలేజియెట్ యూనివర్సిటీ సెలక్షన్స్ ఈ నెల 12వ తేదీన జరిగాయి. ఎస్‌కెఎస్‌డి కళాశాల విద్యార్థిని బి.నాగలక్ష్మీదుర్గ తృతీయ స్థానంలో నిలిచిందని, అంతే కాకుండా ఆదికవి నన్నయ యూనివర్సిటీ తరపున ఫిబ్రవరి 10, 11వ తేదిల్లో నాందేడ్‌స్వామి రామానంద తీర్థమర్తవాడ యూనివర్సిటీలో జరుగే ఆల్ ఇండియా క్రాస్‌కంట్రీ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటుందని కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, ఫిజికల్ డైరెక్టర్ ఎం.రత్నకుమారి అభినందించారు.

నేడు ఉద్యోగుల గ్రీవెన్స్ సెల్

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్ సెల్ కార్యక్రమం ప్రతినెలా మూడో శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఉద్యోగుల గ్రీవెన్స్ సెల్ ప్రారంభమవుతుందన్నారు. ఉద్యోగులు ఎవరైనా తమ సమస్యలు చెప్పుకోవచ్చన్నారు. గ్రీవెన్స్ సెల్‌కు వెళ్లదలచిన ఉద్యోగులకు అధికారులు అనుమతులు ఇవ్వాలన్నారు. జిల్లా అధికారులంతా అందుబాటులో ఉండాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

21న జిల్లా కోర్టు ఏర్పాటు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఈ నెల 21వ తేదీన జిల్లా కోర్టును ఎపి హైకోర్టు అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ కృష్ణమోహన్ ప్రారంభిస్తారని తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు తెలిపారు. స్థానికంగా గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి శేషసాయి, జస్టిస్ నైనాల జైసూర్య, జస్టిస్ భానుమతి, జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి, జస్టిస్ వి.గోపాలకృష్ణ పాల్గొంటారని తెలిపారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - నరసాపురం

విజయవాడలో రూ.600 కోట్లతో నిర్మించిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం స్మృతివనం ప్రారంభోత్సవానికి తరలిరావాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అంబేద్కర్ అభిమానులు ప్రతిఒక్కరూ కేటాయించిన బస్సుల్లో కార్యక్రమానికి భారీగా తరలిరావాలన్నారు. శుక్రవారం ఉదయం పది గంటలకు నరసాపురం పట్టణం స్టీమర్ రోడ్డులో ఉన్న వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద నుంచి బస్సులు ప్రారంభమవుతాయని తెలిపారు.

అంబేద్కర్ జీవితం యువతకు ఆదర్శం

గణపవరం : రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జీవితం నేటి యువతకు ఆదర్శమని గణపవరం డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి అన్నారు. గురువారం కాలేజీలో జరిగిన సామాజిక సంకల్పం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అంబేద్కర్ భారత రాజ్యాంగ వ్యవస్థాపన కోసం కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు జి.వెంకటరమణ, సిహెచ్.అనురాధ, కె.స్వరూపరాణి, జి.వెంకట్రావు, శ్రీనివాసరావు, విద్యార్థులు, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతర

ప్రజాశక్తి - నరసాపురం

స్థానిక 18వ వార్డులో వనువులమ్మ, మహాలక్ష్మమ్మవార్ల జాతర మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పాల్గొన్నారు. జాతర మహోత్సవ ఏర్పాట్లు ఘనంగా చేసిన ఆలయ కమిటీ సభ్యులందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో పాటు మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, కామన బాలసత్యనారాయణ, గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, దొంగ మురళీకృష్ణ, కమిటీ సభ్యులు ఉన్నారు.

పాలకొల్లు రూరల్ : మండలంలోని పాలమూరులో ఉన్న మారెమ్మ, నిలువులమ్మ వార్ల జాతర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. యాత్రికులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

CHANGE OF NAME

I, **MOHAMMAD ZAFRULLA,** S/o. Mohammad Saheb, D.No.12-2-27, Old Bazar, Narsapuram, Narsapuram (Mandal), W.G.Dt., A.P. I have changed my name from **MOHAMMED JAFERULA,** (Old name) to **MOHAMMAD ZAFRULLA,** (New name) hence forth I am being called **MOHAMMAD ZAFRULLA,** S/o. Mohammad Saheb, for all purposes.

తణుకు పురపాలక సంఘం

షార్ట్ టెండరు నోటీసు

ఆర్.ఓ.సి. నెం. 1684/05/2023/ఇ1 — తేది.17-01-2024

తణుకు పురపాలక సంఘ పరిధిలో ఈ దిగువ తెల్పిన పనులకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలువబడుచున్నవి.

		ఇ.సి.వి. (రూ. లక్షలలో)
1. డ్రయిను పనులు	2 నెం.లు	7.90
2. బిల్డింగ్ పనులు	1 నెం.	4.20
3. వాటర్ సప్లయి పనులు	1 నెం.	4.06
4. ఇతరములు	1 నెం.	3.60

సంబంధిత వివరములకు www.apeprocurement.gov.in వెబ్ సైటు నందు ది. 18-01-2024వ తేదీ నుండి చూడవచ్చును.

సం/- **కమిషనరు,** తణుకు పురపాలక సంఘం